# అధైర్య పడొద్దు..అండగా ఉంటా

- కానిస్టేబుల్ కుటుంబం మృతి కలిచివేసింది
- బాధిత కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యాన్నిచ్చిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు

చిన్నకోడూరు, డిసెంబర్ 17: సిద్దిపేట కలెక్టర్ గన్‌మెన్ నరేశ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామంలో నరేశ్ తల్లితండ్రులు, కుటుంబ సభ్యులను హరీశ్‌రావు పరామర్శించారు. దుఃఖంలో ఉన్న వారిని ఓదార్చారు. ఈ ఘటన తీవ్రంగా కలిచివేసిందన్నారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటానని హామీనిచ్చారు. అనంతరం చిన్నకోడూరు మండలం మాచాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుర్రం రాజిరెడ్డి కుమారుడు గుర్రం భాను ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను హరీశ్‌రావు పరామర్శించి మనోధైర్యం నింపారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, ఎఫ్‌పీఓ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌లు శ్రీనివాస్, బాబు, ఎంపీటీసీ జమున, నాయకులు రాజిరెడ్డి తదితరులున్నారు.



కానిస్టేబుల్ నరేశ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

# తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా నిలుపుతాం

**రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు**



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 17: దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా నిలిపేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తామని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం సిద్దిపేట మీదుగా కరీంనగర్ వైపు వెళ్తున్న క్రమంలో జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద పలువురు కాంగ్రెస్ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ, ఉపాధి, పరిశ్రమ, ఐటీ రంగంలో రాష్ట్రం అగ్రగామిగా ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వ పాలసీ విధానాలు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటే మరింత వేగంగా ముందుకు తీసుకెళ్తామన్నారు. ఆరు గ్యారంటీలతోపాటు మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా అన్నివర్గాల సంక్షేమ కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా వచ్చే బడ్జెట్‌లో పొందుపరుస్తామన్నారు. నిరుద్యోలకు జాబ్ క్యాలెండర్ అమలు చేసి ప్రభుత్వంలో ఉన్న ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. మంత్రులు పొన్నం, దామోదర రాజనర్సింహ ఈ ప్రాంత అభివృద్ధికి పాటు పడుతున్నారని తెలిపారు.

# పోలీస్ బాస్‌ల బదిలీ

- హైదరాబాద్ నార్త్‌జోన్ డీసీపీగా మెదక్ ఎస్పీ రోహిణి ప్రియదర్శిని
- హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్‌గా శ్వేత
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

మెదక్ అర్బన్, డిసెంబర్ 17: మెదక్ జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని బదిలీ అయ్యారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన బదిలీలో భాగంగా మెదక్ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఆమె హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీగా నియామకమయ్యారు. మెదక్ జిల్లా ఎస్పీగా చార్జ్ తీసుకున్న రోజు నుంచి మెదక్ జిల్లాలో పటిష్టమైన భద్రత చర్యలు తీసుకున్నారు. ప్రత్యేకంగా మహిళల కోసం షీ టీమ్స్, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేకమైన చర్యలు తీసుకున్నారు. 2023 సాధారణ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించారు.

**సిద్దిపేట సీపీ శ్వేత బదిలీ..**

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 17 : సిద్దిపేట పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్వేత బదిలీ అయ్యారు. 2012 బ్యాచ్‌కు చెందిన ఆమె డిసెంబర్ 26, 2021లో సిద్దిపేట పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. బదిలీలో భాగంగా హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ (డీడీ)గా బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిద్దిపేట మొదటి మహిళా పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్వేత రెండేండ్లుగా కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణ కోసం అనేక చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా షీ టీమ్స్, భరోసా వంటి కార్యక్రమాలతో మహిళల రక్షణ కోసం ప్రత్యేక కృషి చేశారు. సిద్దిపేట కమిషనరేట్ పరిధిలోని యువత, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించారు. సీపీ శ్వేత ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలో హాఫ్ మారథాన్‌తో పాటు కమిషనరేట్ పరిధిలోని పలు పట్టణాల్లో మారథన్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు.

# భక్తజన సంద్రం

- కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న 15వేల మంది భక్తులు
- బోనాలు తీసి..ముడుపులు కట్టిన భక్తజనం

చేర్యాల, డిసెంబర్ 17: కొమురవెల్లి మల్లన్న క్షేత్రం ఆదివారం భక్తులతో సందడి నెలకొంది. మల్లన్న మమ్మేలు స్వామి అంటూ భక్తులు చేసిన నామస్మరణలతో శైవక్షేత్రం పులకించింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సుమారు 15వేల మంది భక్తులు ఆలయానికి వచ్చినట్లు ఈవో అలూరి బాలాజీశర్మ తెలిపారు. భక్తులు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టారు. కొండపై ఎల్లమ్మను దర్శించుకోవడంతోపాటు మట్టి పాత్రలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు రాతిగీరలు వద్ద ప్రదక్షిణలు, కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు పాల్గొన్నారు.

# నీళ్లివ్వండి

- సిద్దిపేట జిల్లాలో రంగనాయక సాగర్‌కు నీటిని విడుదల చేయండి
- మిడ్‌మానేరు నుంచి 1.5 టీఎంసీల నీటిని పంపింగ్ చేయాలి
- అధికారులకు ఆదేశాలు ఇవ్వండి
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి లేఖ రాసిన సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేట, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట జిల్లా రైతాంగానికి యాసంగి పంటకు నీళ్లు అందించాలని, అందుకు అవసరమైన నీటిని మిడ్‌మానేర్ నుంచి రంగనాయకసాగర్‌కు పంపింగ్ చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖ రాశారు. శనివారం శాసనసభలో మంత్రిని కలిసి లేఖను అందజేశారు. ఆదివారం సిద్దిపేటలో లేఖ సారాంశాన్ని మీడియాకు విడుదల చేశారు. నీటిపారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఉత్తమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సిద్దిపేట జిల్లా రైతాంగ ప్రయోజనాలకు సంబంధించిన ముఖ్యమైన విషయాన్ని మీ దృష్టికి తీసుకువస్తున్నట్లు చెప్పారు. మూడేండ్లుగా జిల్లాలో సాగు భూములకు రంగనాయకసాగర్ ద్వారా సాగునీరు అందజేసినట్లు తెలిపారు. ఈ యేడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో యాసంగి పంటకు సరిపోయే నీరు రిజర్వాయర్‌లో లేక రైతాంగం ఆందోళనకు గురవుతున్నట్లు లేఖలో పేర్కొన్నట్లు వివరించారు. యాసంగికి నీళ్లు అందించాలంటే మూడు టీఎంసీల నీరు ఉండాలి. కానీ, ప్రస్తుతం రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లో 1.50 టీఎంసీ మాత్రమే ఉంది. రైతాంగ ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని వెంటనే మిడ్‌మానేరు నుంచి 1.50 టీఎంసీల నీళ్లు రంగనాయకసాగర్‌కు వచ్చేలా పంపింగ్ చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించాలని లేఖ ద్వారా మనవి చేశారు. జిల్లాలో యాసంగి సాగు పనులు జోరందుకున్నాయని, యేటా మాదిరిగానే ఈసారి సాగు నీరు వస్తాయని రైతులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. మూడేండ్లుగా సాగునీటిని అందించిన విధంగానే ఈసారి కూడా యాసంగి పంటకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

# దుర్గామాత ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- దుర్గమ్మ ఆలయానికి రూ.2లక్షల విరాళం
- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, డిసెంబర్ 17 : దుర్గామాత ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వేడుకున్నారు. చేర్యాల పట్టణంలో కనకదుర్గామాత అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి రూ.2లక్షల విరాళం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటు అనంతరం పల్లెల్లో భక్తిభావం పెరిగిందని, కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలతో ప్రజలు ఆర్థికంగా పురోగతి సాధించినట్లు తెలిపారు. ముఖ్యంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పంటలు దండిగా పండి అప్పులు లేకుండా రైతులు జీవిస్తున్నారని, దీంతో పట్టణాలు వ్యాపార, వాణిజ్య రంగాల్లో దూసుకుపోతున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య, కౌన్సిలర్ యాట కనకమ్మాయాదగిరి, ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, ఏఎంసీ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, శివగారి అంజయ్య, అవుశర్ల కిశోర్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జింకల పర్వతాలుయాదవ్, గదరాజు చందు, రాళ్లబండి చందు ఉన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన మెదక్ చర్చి



దైవ సందేశమిస్తున్న పాస్టర్ శ్రీనివాస్



ప్రార్థనల్లో భక్తులు

- ప్రార్థనల్లో పాల్గొన్న వేలాది మంది భక్తులు
- ఆకట్టుకున్న సండే స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 17: మెదక్ చర్చి భక్తులతో కిటకిటలాడింది. క్రిస్మస్ ముందు వచ్చిన ఆదివారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలి రావడంతో చర్చి ప్రాంగణం కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఏసయ్య నామస్మరణలతో హోరెత్తింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గంట గంటకూ జరిగిన ప్రార్థనల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. చర్చి ప్రాంగణంలోని సండే స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా చర్చి ప్రేసీబేటరీ ఇన్‌చార్జి శాంతయ్యతోపాటు పాస్టర్లు భక్తులనుద్దేశించి దైవ సందేశం చేశారు. భక్తులు తమ మొక్కులు తీర్చుకున్న అనంతరం చర్చి మైదానంలోని చెట్లకింద వంటావార్పు చేసుకున్నారు. పాస్టర్లు శ్రీనివాస్, డెవిడ్, జైపాల్, సువర్ణ భక్తులను ఆశీర్వదించారు. ప్రార్థనల్లో చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, జాన్సన్, సంశాన్ సందీప్, సువన్ డగ్లస్, నోబుల్‌సన్, జాయ్‌ముర్రే పాల్గొన్నారు.